క్లుప్తంగా

నేడు వ్యాపార సముదాయాల బంద్

టేకుమట్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా నేడు(గురువారం) మండల కేంద్రంలోని హిందూ పరిరక్షణ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్‌లో హింసకు వ్యతిరేకంగా అన్ని వ్యాపార సముదాయాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అన్ని వ్యాపార సముదాయాల నిర్వాహకులు బంద్‌కు సహకరించాలని, బంద్‌ను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు గమనించాలని కోరారు.

నేడు వాహనాల వేలం

కాటారం: కాటారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు నేడు(గురువారం) స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. వాహన వేలంలో పాల్గొనే వారు 50 శాతం సొమ్మును ముందస్తుగా చెల్లించాలని మిగిలిన సొమ్మును వేలంలో వాహనం దక్కించుకున్న తర్వాత చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్క్రాప్ కింద వేలం వేసే వాహనాలను అధికారుల సమక్షంలో కట్ చేసి ఇవ్వనున్నట్లు తెలిపారు. వాహనం తీసుకున్నవారు జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు నిబంధనల మేరకు వేలంలో పాల్గొనాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల అరెస్టు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులను బుధవారం కాళేశ్వరం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర యూనియన్ సీఐటీయూ పిలుపు మేరకు హైదరాబాద్‌కు తరలిపోకుండా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పిట్టల వెంకటమ్మ, కోరుకొప్పుల కమల, మానెం రజిత, గగ్గూరి రాజక్క, పానెం రాజక్క ఉన్నారు.

అభినందన



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం కమలాపూర్ జెడ్పీహెచ్ఎస్ 2023–24 సంవత్సరంలో పదవ తరగతిలో విద్యార్థులు వరుణ్‌తేజ్, రోహిత్ కుమార్‌లు ఉత్తమ జీపీఏ సాధించారు. దీంతో ప్రధానోపాధ్యాయులు పద్మావతి మెమోంటోతో పాటు రూ.1000 నగదు ప్రోత్సాహక బహుమతిని బుధవారం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓసీపీలో వన మహోత్సవం

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కేటీకే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్–2లో బుధవారం మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్ హాజరై మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంచి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. పచ్చదనం లేకుంటే వాతావరణం కాలుష్యమై అనారోగ్యాల పాలవుతారని.. మొక్కలు పెంచాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు వెంకటరామిరెడ్డి, నజీర్, పోషమల్లు, కృష్ణయ్య, ప్రశాంత్, జోగు బుచ్చయ్య, నారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి సీతక్క హామీ మేరకు అంగన్‌వాడీల పదవి విరమణ నూతన జీఓ వచ్చే వరకు అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లను కొనసాగించాలని అన్నారు. జూలై నెలలో విధులు నిర్వహించిన వారికి వేతనం చెల్లించలేదని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ నిబంధనల మేరకు మినీ అంగన్‌వాడీ టీచర్లు మెయిన్ టీచర్లుగా ప్రమోషన్ పొందినప్పటికీ మినీ అంగన్‌వాడీ టీచర్ వేతనం అందిస్తున్నారని పేర్కొన్నారు. వేతన విషయంలో అధికారుల పనితీరుతో అంగన్‌వాడీలు గందరగోళానికి గురవుతున్నారని వాపోయారు. పదవి విరమణకు సంబంధించి అధికారులు ప్రామాణికంగా తీసుకున్న రికార్డుల ప్రకారం వయసు తేడాలు గుర్తించేందుకు బోన్ పరీక్షలు సమ్మతంగా లేవని అన్నారు. కార్యక్రమంలో సరోజన, సమ్మక్క, వెంకటరమణ, రమాదేవి, రోహిణి, సత్యనారాయణమ్మ, సరోజ, లక్ష్మి, సారమ్మ, రజిత పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కాటారం: విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని ఎస్సై మ్యాక అభినవ్ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో బుధవారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలు, అసాంఘీక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటి జోలికి వెళ్తే జీవితం అంధకారం అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్హర్: విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కొయ్యూరు ఎస్సై నరేష్ సూచించారు. మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ పాఠశాలలో మత్తు పదార్థాల నియంత్రణ, సైబర్ క్రైమ్, ఆత్మహత్యలపై బుధవారం ఎస్సై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాలపడుతూ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పాల్ దూడ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల–కళాశాలలో జిల్లా ఎస్పీ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సెకండ్ ఎస్సై ఎండీ శాఖాన్ సిబ్బందితో కలిసి మత్తు పదార్థాలపై విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించారు. అలాగే 'మత్తు పదార్థాలపై అవగాహన–యువతపై దాని ప్రభావం' అనే అంశంపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి ఎస్.హిందు, రెండవ బహుమతి మణిదీపిక, మూడవ బహుమతి విన్నిప్రియలు అందుకున్నారు. వీరికి ఎస్సై, శాఖాన్, పాఠశాల ప్రిన్సిపాల్ భిక్షపతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



కాటారం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై అభినవ్



మల్హర్: అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేష్



చిట్యాలలో..

మహాముత్తారం: డ్రగ్స్ రహిత తెలంగాణ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని విద్యార్థులకు కాటారం సీఐ నాగార్జునరావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వలన కలిగే నష్టాల గురించి వివరించారు. వాటి వాడకాన్ని నివారించుటకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు తల్లిదండ్రులకు మాదకద్రవ్యాల వాడకం గురించి వివరించాలని దానిపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని కోర్కిశాల మోడల్‌స్కూల్, ఇంటర్ విద్యార్థులకు ఎస్సై అశోక్ మత్తు పదార్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రభాకర్, సారంగపాణి, కృష్ణ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు..

టేకుమట్ల: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఏఎస్సై పింగిళి అమరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, గ్రామంలో గ్రామస్తులతకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేశ్, మల్లన్న, కానిస్టేబుళ్లు నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.



మహాముత్తారం: సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగార్జున



మొగుళ్లపల్లి: అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశోక్



టేకుమట్ల: మాట్లాడుతున్న అమరేందర్‌రెడ్డి

బామ్మర్దిపై బావ కత్తితో దాడి

కాటారం: సొంత బామ్మర్దిపై బావ కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన సంఘటన కాటారం మండలం గుండ్రాత్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్రాత్‌పల్లికి చెందిన సాయిప్రియ, చెన్నూర్ మండలం బావ్‌రావుపేటకు చెందిన కమ్మగోని ప్రణయ్‌కి గత ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నేళ్లుగా ప్రణయ్ అతడి భార్య సాయిప్రియతో గొడవపడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం భర్త గొడవపడటంతో సాయిప్రియ తల్లిగారింటికి వచ్చింది. సాయిప్రియ అన్న సాయికిరణ్ ఆమెకు సపోర్టు చేస్తున్నాడని ఎలాగైన అతడిని అడ్డుతొలిగించాలని ప్రణయ్ భావించాడు. మంగళవారం అర్ధరాత్రి గుండ్రాత్‌పల్లిలోని అత్తగారింటికి చేరుకొన్న ప్రణయ్‌త తన వెంట తెచ్చుకున్న కత్తితో బామ్మర్ది సాయికిరణ్‌పై దాడికి పాలపడ్డాడు. దీంతో సాయికిరణ్ తప్పించుకోబోగా నుదిటి, ఎడమ చేయికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బుధవారం సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

జూనియర్ లైన్‌మన్లకు పదోన్నతులు



పదోన్నతి పత్రాన్ని తీసుకుంటున్న ఉద్యోగులు

కాళేశ్వరం: కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని జూనియర్ లైన్‌మన్లకు అసిస్టెంట్ లైన్‌మన్లుగా పదోన్నతులు పొందినట్లు ఏడీఈ నాగరాజు, ఏఈఈ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. కాటారం, మహదేవపూర్, మల్హర్, పలిమెల మండలాల్లో ఎన్పీడీసీఎల్‌లో జూనియర్ లైన్‌మన్లుగా పని చేస్తున్న 18 మందికి అసిస్టెంట్ లైన్‌మెన్లుగా పదోన్నతి పొందారని అన్నారు.

కారుణ్యనియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులతో ఎమ్మెల్యే సత్యనారాయణరావు, అధికారులు

భూపాలపల్లిరూరల్: భూపాలపల్లి ఏరియా సింగరేణి ఎక్స్ ఎంప్లాయిస్ డిపెండెంట్లకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. బుధవారం సాయంత్రం సింగరేణి జీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై 14 మంది డిపెండెంట్లకు జీఎం సయ్యద్ అబీబ్ హుస్సేన్‌తో కలిసి ఎమ్మెల్యే కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. అదేవిధంగా, వివిధ కారణాలతో మరో నలుగురు డిస్మిస్ కాగా, వారిని కూడా తిరిగి విధుల్లోకి తీసుకోడానికి నియామక ఉత్తర్వు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎస్ఓటు జీఎం వెంకటరామిరెడ్డి, పర్సనల్ మేనేజర్ మారుతి, జీఎం కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

'జీతాలు ఇవ్వకుంటే కూలికి పోతాం..'



వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ సిబ్బంది

కాటారం: జీతాలు ఇవ్వకుంటే కూలికి పోతామని మండలంలోని ప్రతాపగిరి, చిద్నెపల్లి గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది వాపోయారు. జీతాలు వచ్చే వరకు విధులను బహిష్కరిస్తున్నట్లు తెలుపుతూ గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది బుధవారం పంచాయతీ కార్యదర్శి శంకరయ్యకు వినతిపత్రం సమర్పించారు. పది నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమతో పనులు చేయించుకుంటున్నారే తప్ప జీతాల గోడు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పలుమార్లు వారి దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని రేపు, మాపు అంటూ కాలం వెల్లదీస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం పంచాయతీ సిబ్బందికి నిధులు మంజూరు చేసినట్లు ప్రకటనలు ఇచ్చిందే తప్ప తమకు మాత్రం జీతాలు అందలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మల్లయ్య, కమల, శ్రీకాంత్, శ్రీనివాస్, సమ్మయ్య, లచ్చయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌ను నియమించాలి



పరామర్శిస్తున్న మల్లేశ్

చిట్యాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి నూతన సూపరింటెండెంట్‌ను నియమించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ అన్నారు. బుధవారం ఆయన ఆస్పత్రిని సందర్శించి రోగులను పరామర్శించారు. అనంతరం అయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ జీడి తిరుపతి బదిలీ అయ్యారని తెలిపారు. దాదాపు నెలరోజుల నుంచి సూపరింటెండెంట్ లేక పోవడంతో వైద్య సేవలకు అంతరాయం కలుగుతుందని వాపోయారు. అలాగే ఆస్పత్రిలో 18 మందికి గాను ఆరుగురు డాక్టర్లు మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి ఆస్పత్రికి సూపరింటెండెంట్‌ను, వైద్యులను నియమించాలని కోరారు. ఆయన వెంట సాయికుమార్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన మూసాపురి సరోజనకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చింతల రమేశ్ బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. సరోజన కొంత కాలం క్రితం అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. దీంతో ఆమె ఆర్థికంగా నష్ట పోవడంతో ఎమ్మెల్సీ మధుసూదనాచారి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 45వేలు నిధులను మంజూరు చేయించారని రమేశ్ తెలిపారు. ఈ మేరకు సరోజనకు చెక్కును అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డె శంకర్, పువ్వాడి హరికృష్ణ, కొడెల రాయమల్లు, వేణువంక శ్రీదేవి, ఉప్పుల కిరణ్, గురుకుంట్ల కిరణ్, జెన్నె యుగేందర్, రాయిని శ్రీకాంత్, మూసాపురి రవి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై షాఖాన్

చిట్యాల: వాహనదారులు రోడ్డ భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై షాఖాన్ అన్నారు. మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సై బుధవారం వాహనాల తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనుమానితుల వివరాలను తెలుసుకుని వదిలేశారు. వాహన పత్రాలు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు వాహన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఆయన వెంట సివిల్, టీఎస్ఎస్‌పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ నాగార్జున

మహాముత్తారం: గ్రామాల్లో సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత ఉంటుందని సీఐ నాగార్జునరావు అన్నారు. బుధవారం మండలంలోని పెగడపల్లి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ నాగార్జునరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో క్రైం రేటు తగుతుందని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో సహకరించిన గ్రామప్రజలకు, వాణిజ్య వ్యాపారస్తులకు అభినందనలు తెలిపారు. అదే విధంగా మండలంలోని ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రజలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్‌కుమార్, గ్రామస్తులు జగపతినాయక్, వంశీరాజ్, పోలీస్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.

కళాశాలలో 'వృక్షాబంధన్'



వృక్షానికి రాఖీ కడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వృక్షాబంధన్ కార్యక్రమాన్ని వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ రజిత ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృక్షానికి విద్యార్థులు అధ్యాపకులు రాఖీని కట్టారు. అనంతరం ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ మాట్లాడుతూ.. చెట్లు జీవకోటికి మేలు చేస్తున్నాయన్నారు. మనం చెట్లను కాపాడితే అవి మనల్ని కాపాడతాయని అన్నారు. అధ్యాపకురాలు రజిత మాట్లాడుతూ.. మానవ మనుగడకు వృక్ష సంపదను రక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిది అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజు, రవీందర్, రమేశ్, రాజేందర్, మున్నయ్య, పరశురాములు, రవీందర్, మాధురి, హనుమ, అధ్యాపకేతర బృందం శ్రీధర్, వెంకటయ్య, రవీందర్, కరీంబీ, శివ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి వ్యతిరేకం'



మాట్లాడుతున్న నాయకులు

మల్హర్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి వ్యతిరేకమని మాల మహానాడు నాయకులు అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్‌బంద్ పిలుపు నేపథ్యంలో మండలంలోని తాడిచర్లలో బుధవారం తలపెట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా మాల మహానాడు ఆధ్వర్యంలో నాయకులు మండలంలోని తాడిచర్ల వర్తక వ్యాపార, వాణిజ్య సముదాయలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలను బంద్ చేయించి నిరసనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కులాల, వర్గాల మధ్య చిచ్చు పెట్టేందుకే వర్గీకరణకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బండి రణధీర్‌రావు, సాగర్, లడ్డు, రాకేష్, శశి, సాయి, పవీణ్, అభి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు మౌనిక, గీత

కాటారం: హాస్టళ్లలో ఉండే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారిని డాక్టర్ మౌనిక సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎస్సీ బాలికల వసతి గృహంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య సిబ్బంది విద్యార్థినులకు జ్వర, రక్తహీనత పరీక్షలు, పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, హైజిన్, హ్యాండ్‌వాష్, సీజనల్ వ్యాధుల గూర్చి డాక్టర్ మౌనిక విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వంటశాలలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వేడి పదార్థాలను ఎప్పటికప్పుడు తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పి గీతా, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్ఎంలు రజిత, సునీత, స్వరూపరాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

గోవిందరావుపేట: బాలల హక్కులను పరిరక్షించాలని ఎంపీడీఓ జవహర్‌రెడ్డి అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమిరెడ్డి, సీడీపీఓ మల్లేశ్వరీ, డా.చంద్రకాంత్ మాట్లాడుతూ.. బాలలకి స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచడం మన అందరి బాధ్యత అన్నారు. గ్రామ స్థాయిలో బాలల హక్కుల కమిటీలను పర్యవేక్షించేందుకు మండల బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో, మండలాల్లో నిస్సాహాయ స్థితిలో ఉన్న బాలలకు తోడు ఉండేలా కమిటీలో చర్చించుకోవాలని అన్నారు. పిల్లల సమస్యలపైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థలను నిర్మూలించేందుకు బాలల పరిరక్షణ కమిటీలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, డీసీపీయూ సోషల్ వర్కర్ జ్యోతి, కిశోర బాలలు పాల్గొన్నారు.